పుష్పమానసము

మంత్రవాది వీర వెంకట సత్యనారాయణ

అంశం: తెలుగు పద్య కవిత్వము

రచన: మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ

ప్రధమముద్రణ: 15-9-2021

ప్రచురణ: మంత్రవాది

ప్రతులు: 500

వెల: 41/- రూపాయలు

ముఖచిత్రం: సీతా మహాలక్ష్మి శనగల, హైదరాబాద్

ముద్రణ: వినాయక ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్,

8885077341,9912277341

హక్కులు: సర్వస్వామ్యములు రచయితవే©

ప్రతులకు:

రచయిత

16-31-63/7, బాలాజీనగరు,

11వలైను, పాతగుంటూరు

గుంటూరు-522 001

ఆంధ్రప్రదేశ్

గతిశీల: 8121499695

మున్నుడి

నన్ను అనుక్షణం ప్రోత్సహించుచు, నావెన్నుఁదట్టి పద్యరచన యందు అనేక విషయము లుపదేశించి, రచనకు కావలసిన ధైర్యమును నింపుచూ, ముందుకు నడిపించుచున్న మద్గురువరేణ్యులకు వేవేల కృతజ్ఞతా పూర్వక నమస్సులు.

నేను ఆకాశవాణి యందు, మరియు వివిధ మాధ్యమములందు నిత్యము వ్రాసుకొన్నట్టి అనేక విధముల పద్యఖండికలను ముద్రింపమని అమూల్యమైన సలహానిచ్చి, ఈ *పుష్పమానసము ఖండ*కావ్యము రూపుదిద్దు కొనుటకు అనేక విధముల సహకరించిన వారు కవివరేణ్యులు, ఉభయభాషా కోవిదులు, విశ్రాంతాంధ్రోపన్యాసకులు బ్రహ్మశ్రీ ***డా.రామడుగు వేంకటేశ్వర శర్మ*** గారికి హృదయపూర్వక వేవేల కృతజ్ఞతాభి వందనములు .

- రచయిత

సమర్పణం

నా ఉన్నతికి అహర్నిశలూ శ్రమించి ఎన్నో కష్ట నష్టాల కోర్చి ఉన్నత విద్యను చెప్పించి నిరంతరం నావెంట ఉండి ధైర్యంగా ముందుకు నడిపించిన మహా మనీషి త్యాగమూర్తి మానాన్న కీ॥శే॥ శ్రీ మంత్రవాది కృష్ణమూర్తి గారికీ, ఏ లోటూ రాకుండా కంటికి రెప్పలా కాచి పెంచిన ప్రేమమూర్తి మా అమ్మ కీ॥శే॥ శ్రీమతి దమయంతి గారికీ భక్తి ప్రపత్తులతో ఈ చిరుపొత్తమును కృతజ్ఞతాపూర్వక నమస్సు మాంజలులతో సమర్పించుకొను చున్నాను.

-కృతికర్త

1. మ్రొక్కఁగ వేల్పులు

కం. వేగమె మోక్షముఁ గల్గును
త్రాగఁగ నామామృతమును ధరణిని కనఁగన్
భోగము వీఁడుచు భక్తిఁగ
రాగముఁ దీయుచుఁ బాడిన రాముఁడు మెచ్చున్ 1

కం . పదములు పొరబడు చున్నవి
ముదమునఁ జేకొని భగవతి మోదముతోడన్
సదమున మెచ్చఁగఁ గవులిట
పదముల నల్లఁగను గూర్చు బలిమిని నాకున్ 2

తే.గీ. కలియుగమ్మునఁ దీండ్రింపఁ గరుణతోఁడఁ
గొలువుఁ దీరి రక్షింపఁగ కొండ పైనఁ
దీన జన బాంధవునిగనేతెంచి నాడు
వేదగిరివాస నరసింహ వెతలఁదీర్ప 3

కం. హరి నామము వలదంచునె
హరి నిక్కడఁ జూపుమనఁగ, హరిదయ నామొ
క్కరమున హిరణ్య కశిపుకు
నరసింహుని జూపినంత నడుఁకును బొందెన్ 4

కం. గరళము కంఠముఁదాఁచఁగ
శిరమున సోముని వహించు శితికంఠునిగన్
మఱుగున నుంచుచు దొసఁగుల
పరములఁ దెల్పఁగఁ గవితలఁ బ్రార్థన లిడెదన్ 5

కం. చిక్కఁడు సంపదలకు మఱిఁ
జిక్కఁడు సురలకు మునులకుఁ జిక్కఁడు సిరికిన్
జిక్కఁడు మాయలఁ జేయఁగ
జిక్కెను తులసీ దళమ్ము చేతను సతికిన్ 6

కం. మ్రొక్కులఁ దీర్పఁగ నాపద
మ్రొక్కులవాడు భువిఁగాచు మోదము తోడన్
దిక్కును జూపును సతతము
నిక్కము మ్రొక్కంగ స్వామి నెమ్మినిగూర్చున్ 7

కం. విఘ్నము లేర్పడినప్పుడు
జఘ్నని ఝుళిపించువాడు జగతిని కాచున్
విఘ్నాధిపతియె కొనఁగ శ
తఘ్నని పరిమార్చు దుష్ట తతిని సరగునన్ 8

కం. పీచము నణచఁగ దుష్టుల,
బ్రోచుచు భక్తులకుఁ బొల్పుఁ బూన్పఁగ సతమున్
బూచుల ఱేడును పార్వతిఁ
గాచును సర్వము ధరణిని గంగను గూడిన్ 9

కం. మ్రొక్కఁగ వేల్పులు నీదరిఁ
జక్కఁగ జేరుచు దయఁగొని సంరక్షించున్
దిక్కులఁ జూడక శీఘ్రము
దిక్కువు నీవే నటంచు దెల్పుమ! నతులన్ 10

2. సూక్ష్మ క్రిమి

కం. సూక్ష్మాతి సూక్ష్మ క్రిమి దా
పక్ష్మలముల మూసి తెఱువఁ బఱఁగుచు నుండెన్
లక్ష్మణ సోదర! రఘుపతి
యక్ష్మము కలిగించు దాని నడచఁగ రావా! 1

కం. భారము లయ్యెను బ్రతుకులుఁ
ఘోరముఁ జూడఁగఁ జనులిల కుతిలము తోడన్
నీరును గంటను గ్రుక్కిరి
శ్రీరఘువర! కావుమయ్య! ఛిద్రము నణచన్ 2

కం. నీల గగన ఘన శ్యామా!
చాలిక నోర్వఁగ లేము జంప కరోనన్
ఏలకొ? జాప్యము శ్రీశా!
ఏలఁగ రావయ్య స్వామి! ఇడుములఁ దీర్పన్ 3

కం. ధారణి విలవిల లాడఁగ
బోరున విలపింప జనులు బుగులును బొందన్
శ్రీరవి కుల వంశోత్తమ!
శ్రీరమణీ హృదయనాథ! చీల్చు కరోనన్ 4

తే.గీ. చెట్టు కొకరుఁ బుట్ట కొకరన్నట్టు జనులు
బ్రాణ మఱచేతఁ జేకొని భయము తోఁడ
సూక్ష్మక్రిమిఁ జేయు నష్టముఁ జూడలేక
కనుల నీరును గ్రక్కఁగఁ గావవేమి? 5

తే.గీ. సకల సృష్టికి మూలము సత్త్వమీవు
నిట్టి కీడును కలిగించు క్రిముల కేల?
నభయ మిచ్చుచుంటి విలను
శీఘ్ర మణచుమ! మముఁగాచ శ్రీహరీశ! 6

కం. ఆర్తిని దీర్చెడు వాఁడవు
కర్తవుఁ గర్మవుఁ గ్రియలకుఁ గారకుఁడవు మా
యార్తినిఁ దొలగింపుమయా!
వర్తనమును గడుపు విధినిఁ బల్కుము దేవా! 7

కం. మానవ మాతృల మైతిమి
పేనకు పేల దొసఁగులను వీక్షించితివే!
కానఁగ రావా! రమణా!
దీనుల మము సైపవయ్య! తెలిదీవి దొరా! 8

కం. శ్రీకర! నుతింతుఁ బ్రణతుల
మోకరిలుచును, గరుణింప మోహన రూపా!
నాకముఁ జేయుమ! ధరణిని
భీకర సింహా! కరోన పీచ మణచుమా! 9

కం. మేవడి తోడను బ్రణమిలి
నీవే! దిక్కని యజింప నిర్దయ విడుమా!
త్రోవను జూపుమ! శీఘ్రము
కోవిడు కోరలను బీకి కూరిమిఁ గనుమా! 10

3. పుష్పమానసము

కం. పరిమళముల వెదజల్లుచుఁ

బరిపరి విధముల మదులకుఁ బరితోష మిడన్

విరితోపులఁ బూయఁగ మీ

కరములతో ద్రుంచిపైచి గాయ పరుతురే! 1

కం. మీ కొన గోటను గటువుఁగ

మా కుత్తుకలను జిదుముచు మము వేధింపన్

మీకిది తగునా? మానవు

లేకద! దయలేద? ఏటికీ పను లకటా? 2

కం. మృదువగు మా జీవితములు

సుదతుల చేతను బడంగ సూదుల తోడన్

యదలనుగ్రుచ్చుచుగూర్చఁగ

ముదముగ మాలల ధరింత్రుముచ్చటఁబడుచున్ 3

సీ. మండు వేసవిలోనమల్లెలుగవిరిసి

మీ మానసములకు మేల్మరులిడఁ

బుడమిని దక్కెను బూర్వజన్మఫలమో!

మా జన్మలిటఁగల్గెమాన్యులార!

సుదతులుమీరలుసుంతయు జాలిని

చూపరు కఠినులుజోద్యమిదియె!
కొప్పుఁదుఱుముకొనిమెప్పునుబొందుచుఁ
బారవైతురుకదా! వాడినంత

తే.గీ. ఏమి పాపము చేయఁగ నిటఁ బడితిమొ!
జాలి లేనట్టి హృదయాల పాలఁబడఁగ
ముగ్ధ తత్త్వము లన్నియు మోటుబారె
బ్రకృతి తల్లి! నీకిదె కోటి ప్రణతులమ్మ! 4

కం. నోముకుఁ బూజకుఁ జావుకు
మేమిట నుపయోగ పడఁగ మెలపును గూర్పన్
గోముఁగ విరియఁగ ధరణిని
యామపు కాలమున జీవ మణఁగును మాకున్ 5

కం. అరవిరిసిన మా బ్రతుకులు
నరయఁగ ఛిద్రములు మానవాళి కరములన్
ఎఱుఁగరె! కుసుమపు తత్త్వము
మఱచితి రేలకొ? మనుజులు మానవ జన్మన్ 6

తే.గీ. ముగ్ధ తత్త్వము నెఱుఁగరే? ముదితలార!
ఏల మమ్ముల నివ్విధి నేడిపింప
తగున? మీకిది యోచించి తగిన విధిని
మమ్ముబ్రతుకనిండు భువిని నిమ్మునొంద 7

తే.గీ. మీరు సౌఖ్యము నొంద మా మెడలఁ బట్టి
యుత్త రింతురు కుత్తుక లుక్కఁబట్ట
నుసురు విలవిల లాడఁగ నొక్కపట్టుఁ
గుచ్చి కూర్తురు ధరియింపఁ గొప్పు నందు 8

ఆ.వె. ప్రాణములను బాసి పరితోషముల నిచ్చి
యనుదినమును మీకు నందమిడఁగ
క్రుంగి పోవ మేము కొంత యైనను జాలిఁ
బడక నిష్ఠురముఁగ నడతు రేల? 9

ఆ.వె. మమ్ము విడువరండి మాన్య పడుచులార!
వేడుచుంటిమి మమ్ము విడువరండి
మమ్ము బ్రతుక నిండు యమ్మలార! శరణు
జొచ్చి మిమ్ము కోరు చుంటిమమ్మ 10

కం. అంపఁగఁ దేవుఁడు సృష్టిని
సొంపుగఁ బెరుగుచుఁ జగతికి సోయగములతో
నింపును గూర్చెడి మమ్ములఁ
జంపకఁ జీవింప నిండు శతకోటి నతుల్ 11

(కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పాద పద్మములకు నమస్సులతో)

4. ఊర్ధ్వ లోక సప్తకము

తే.గీ. ఎఱుపు వర్ణము తోడను వరలు చుండు
నాల్గు రేకుల తామర నంద మడర
గుదపు స్థానమె యాధార సదన మగును
గణపతియె యధిపతి యయ్యె బ్రణతు లిడఁగ 1

తే.గీ. సత మరయఁగ స్వాధిష్ఠాన చక్ర మారు
పర్ణముల తమ్మి సింధూర వర్ణమందు
నంగమునకు వెనుక నుండు నజు డధిపతి
సలిల తత్త్వము తోడను నలరు చుండు 2

తే.గీ. నాభి మూలము న్వెన్నులోన మణిపూర
చక్రముండు బద్మము వలె స్వర్ణ వర్ణ
మలరఁ బదిరేకులఁ గలిగి యమరి యుండు
విష్ణు వధిపతి యయ్యెను వెలుగు మీర 3

తే.గీ. హృదయమునకు వెనుక నుండ రేకులు పది
రెండు తోడ నధిపుఁడు రుద్రుండు కాగ
పవనిలె ననాహత మచట నంబుజమ్ముఁ
బోలె వాయుతత్త్వము తోడ పొల్పు నమరు 4

తే.గీ. కంఠమందు విశుద్ధ చక్ర మమరంగ
నసిత వర్ణముఁదాల్చఁగ నధిపతిగను
జీవుడు ప్రవర్తిలుచు నుండఁ జెలఁగె నచట
నాకసపుఁ దత్త్వమున వెల్గుల డరుచుండు 5

తే.గీ. భ్రుకుటి యందు నాజ్ఞాచక్ర మొప్పు , రెండు
దళములు గలిగినట్టి యా తామర వలె
ధవళ వర్ణము తోడను దనరుచుండు
దీని కధిపతి యీశుఁడు తెలియరండి 6

తే.గీ. బ్రహ్మరంధ్రము నందునఁ బద్మము వలె
వేయి రేకుల తోడను విక్కవిరిసి
ముక్తి నిచ్చునుసాధింప శక్తి కలది
అధిపతిగ పరమేశ్వరు డమరి యుండు 7

తే.గీ. పరమ పూజ్యులు యోగులు బరఁగి రిచట
యోగ సాధనలను జేసెనోర్పు తోడ
ఫలము సాధించి చూపించె పరిఢవిల్లె
మనకుఁ గల్గిన భాగ్యము మాన్యులార! 8

తే.గీ. చక్రసాధన జనులకు శాంతి నిడఁగ
నాయురారోగ్యములకెప్డునందలంబు
జేయ గురువుల చెంతను శ్రేయమబ్బు
సకల రోగ నిరోధమ్ము సాధకులకు 9

ఉ. యోగము ధ్యానము ల్గనఁగ నోర్పుఁగ సాధనఁ జేయఁగన్ సదా
వేగమె దర్శనం బగును పేరిమిఁ గూర్పఁగ నంబుజమ్మునన్
భోగము గల్గగన్ జనులు బొల్పును బొందెద రెల్లరు న్భువిన్
యాగము వంటిదీ నియమ యబ్బెస మందురు సాధనంబుగన్ 10

5. అన్నమయ్య

చం. కలియుగ దైవమున్గనఁగ గానముతోడ నుతించుచున్ సదా
తెలియఁగ జేసితీవుఁ నిలఁ దీరుగ స్వామిని నెవ్విధిన్గనన్
బలు మధురంపు గీర్తనలఁ బాడి జనాళికిఁ భక్తి తత్త్వమున్
బలు దెఱఁగుల్ వచించితివి ప్రాకటము న్హరి పూజ సేయగన్ 1

మందాక్రాంతము:

భారంబుల్ వీడి సరగున శ్రీపాద సాన్నిధ్య సేవన్
కోరంగన్ భక్తి పథమును గైకొంచుఁ గీర్తింపగన్ ని
న్నారాజీవాక్షుఁడు గొనఁగ నోయన్నమయ్యా! స్మరింత్రా
తారా చంద్రార్కము జనులు నీ ధన్యతా ప్రాభవంబుల్ 2

పంచచామరము:

పరాత్పరున్గనంగ నీవు పర్వతమ్ముఁ జేరగన్
వరమ్ము లేమి కోరలేదు వర్తిల న్ముదమ్ముగన్
పరమ్ము కోరి భక్తితోడ పారవశ్య మొందుచున్
మురారి కీర్తనమ్ముఁ జేసి ముక్తి నొందినావయా! 3

సీ. సురపూజి తానంద శోభనా చలపతి
రాజీవ నేత్రుడార్త జన నాథు
డాది దేవుడనంతు డఖిలాండ కోటి బ్ర
హ్మాండ నాయకుడైన యక్షధరుని
నవ్యయానంతుని నాది వరాహుని
నభిరూపు డక్షరు డమర ప్రభుని
సప్తాద్రి నాథుని సామగానప్రియు
డమృతేశయుని నీరజాక్షు హరిని

తే.గీ.   అన్నమయ్య కీర్తనలతో నద్రిపైన
మాతలిద్దరిఁ గూడిన మహిత మూర్తిఁ
దలచి నిరతము గోవింద ధ్యాన మందు
బ్రహ్మ కడిగిన పాదముఁ బట్టి కొలిచె 4

మ.కో. మేలుఁ గొల్చుచు నిత్యమున్ పలు మేలుకొల్పుల తోడుతన్
ఏలుకొమ్మని కీర్తన ల్పదె యేడుకొండలస్వామినిన్
వేలవేలుగ పాటల న్భళి వేగము న్రచియింపగన్
లీలజాలము సేయగన్ హరి లీలలెన్నియొ చూపెనే 5

కం. పదములఁ గట్టుచుఁ బాడుచు
పదివేల శిరముల హరికి భక్తిని బూన్పన్
సదనము నందున నిత్యము
సదమల మలరంగ భక్తి సారము నిండెన్ 6

ఉ.   నిత్యము శ్రీహరి న్దలచి నెమ్మిని గూర్చుచు పాడుచున్ సదా
సత్యము దెల్పగ న్బ్రజకు సత్త్వపు తత్త్వము నేర్పెనాతడున్
ముత్యములౌ పదమ్ములను ముచ్చటఁ గూర్చెను దేవదేవుకున్
శత్య పదమ్ముల న్మలచి స్వామికి నంకిత మిచ్చె భక్తిగన్ 7

మ. హరి నామమ్ముమ్మను బాడినంత హృది౯ దానానంద మొందంగనే
    పరితాపం బణగంగ నిమ్మహిని పాపంబు ల్న శించున్ సదా
    వరశ్రీవేంకట నాథుడే కన౯గ సేవారక్తు డాయన్న మ
    య్యరహి న్నాటల౯ గూర్చ౯గా సదమలంబౌ నందము న్బొందగన్ 8

మ.కో. జోలపాటలు పాడినావట జోజొయంచును స్వామికిన్
    లాలి లాలియనంగ విష్ణువు రామచక్కని వాడిగన్
    పాలసంద్రపు కాంతులన్ హరి పాపరాయని పాన్పుపై
    లాలసమ్ముగ పవ్వళించెను రాజసమ్ముగ నందమున్ 9

సీ. అంతట నీవని హరిని౯ గీర్తనలతో
        నిరతము౯ గీర్తించె నెమ్మి తోడ
    నర్పించె సర్వము నాతడే హరియని
        యన్యమేమియు వల దంచు భక్తి
    సంగీత సాహితి న్నమసింపగను జేసె
        నైవేద్యముగ నిడె నైష్టికము౯గ
    నంతరమ్ముమ్మన౯ గొలుపైయున్న స్వామిని
        నిత్యము దర్శించి నిక్కమత౯డె
    కాచు నీ ధరణిని కంటి రెప్పను వోలె
        యంచును జనులిల నాలకింప౯

గీర్తనలను వ్రాసి కీర్తించె శౌరిని
యద్రిని దిరుగుచు నన్నమయ్య!

తే.గీ. మెచ్చె నాతని భక్తిని మేవడిఁ గని
సైక్య మొందఁగ తనలోన నాజ్ఞ నిడఁగ
స్వామి చెంతకుఁ జేరెను వరలెఁ గీర్తి
జగముఁ గీర్తించె నాతని న్సజ్జనునిఁగ 10

6. తేనె లూరు భాష

తే.గీ. ధ్రుతమ! నినుజూచి కళయని తొట్రిలఁగను
పద్య భావన పొంతన ప్రక్కదారి
బట్టె, నర్థమనర్థము, వ్యర్థ మయ్యె
నిను గనుగొని నప్పుట నిత్యమయ్యె 1

కం. అత్తను జూచిన కోడలు
నత్తా! యని పిలిచి నంత నత్త యెవరె? నే
నత్త యనుచు దీర్ఘ మిడఁగ
నత్తను నత్తయనఁదప్ప? యలుకవిడుమనెన్ 2

కం నడుమ యడాగమములఁ గనఁ
గడుఁ గలవరము న్గలుగఁగఁ గడకుఁ ధృతంబై
యడరఁగ మఱల మఱలఁ
గడచఁగ సంధుల గ్రహింపఁ గటకటఁ దోచెన్ 3

తే.గీ. తెలుగు తల్లి తోడుండఁగ తియ్యనైన
నాదుభాషఁబల్కించెద నంద మిడెడు
కైతలను నాదరింపఁగ జోత నిడుచు
నిలిచెద శిరమును వంచి నెమ్మితోడ 4

ఆ.వె. వహ్వా! వహ్వా! యనుచు పదిమంది పొగడఁగ
కవనమందు జవము కనఁగ రాదు
దొసగులెంచి తెల్పఁ దొలగు ననౌచితి
వరలు సతము పదము భవ్య మలర 5

తే.గీ. తేనెలూరు భాష తేట తెలుగు ననుచు
గవులుఁ జెప్పి రిచట గర్వముగను
వేరు భాష లేదు విశ్వమందు
జూడఁ జేజేలు బల్కెదఁ జోతలఁ బూన్చుచున్ 6

కం. పరుష, సమాసములను మఱి
సరళము, సంధులను నేర్వ సారము దెలియున్
సరి వ్యాకరణము లర్థము
తెలుఁగుల నేర్చిన పదములుఁ దేలిక పడునే 7

తే.గీ. ఆదికవు లిటఁ జూపఁగ నట్టి విధిని
కవన సంపద నొందఁగఁ గవిగ మెలగి
కావ్య తఱగల పైనను కదలి యాడి
సార్థకముఁ జేసుకొనవలె జన్మ నిలను 8

తే.గీ. దేశ భక్తిని చాటఁగతెలుఁగు కవిత
వ్రాయ సాహిత్యమందున వేయి యడుఁగు
తెలుఁగు నేర్చిన జాలును తేనె లూరు
కవనములు వేయినిట వ్రాయగలము మనము 9

తే.గీ. దేశ భాషలఁజూచిన దివ్య మైన
పూర్వ సంపద మనభాషపొలుపునొంద
తెలుఁగు మనకు నూపిరికద! తేజ మలరు
భాష సతతము వర్థిల్లు భాష మనది 10

ఆ.వె. నిత్యమొక్క పదము నిక్కముఁగఁ జదువ
బ్రతుకుఁ దెఱువుఁ దెలియు రహినిఁ బొంద
సత్య మరయుమయ్య! సాగింపఁబ్రతుకును
దెలివి మీరి మసలు తెలుఁగువాఁడ! 11

కం. బద్దెన సుమతీ, వేమన
సుద్దులఁ జదువంగఁ గూరు సుప్రభ సుమతుల్
నొద్దిక నబ్బును సరఁగున
నద్దిక మేర్పడును జూఁడ నశ్చరు వేలా? 12

ఆ.వె. దేశ బాసలందుఁ దెలుగులెస్స యనుచుఁ
గృష్ణదేవరాయ తృష్ణఁ జెప్పె
సుందర తెలుఁగనెను సుకవి భారతియరు
నెంత గొప్ప భాష నెంచ తరమ! 13

ఆ.వె. తెలుఁగు చిత్రసీమ తెరకు నెక్కించెను
పెక్కు కావ్యములను పెరిమెనొంద
కావ్యకన్య సిగను కల్కి తురాయిలై
భాస మొందె తెలుఁగు వారి కీర్తి 14

7. మర్మముఁదెల్పుమ!

కం. మర్మముఁ దెల్పుమ! చెలియా!
ధర్మమ! కోపమును వీడి దరిఁ జేరఁగ రా!
నిర్మలమౌ నీ వదనము
పేర్మిని వర్జింపరాదు వేగమె కనుమా! 1

కం. నీ కోపము నోర్వగలన!
ఓ కువల నయన! తరింతు నోరిమిఁ జూపన్
నీ కన్నుల సెబ్బదనము
పేకాంతుల దీపమయ్యె ప్రియమగు దానా! 2

కం. రోజంతా యీ విధముగ
భోజన పానముల విడుట పొల్పుఁగ లేదే!
ఓ జవరాలా! తెల్పుమ!
నే జేసిన తప్పులన్ని నెమ్మిని కనుమా! 3

కం. లలనా! ప్రియతమ! విడుమా!
అలుకలు తగునా కనగనునలివేణికిటన్
కులుకుల తోడను నీవిడు
పలుకులుకరువయ్యె నాకు పలుకఁగ రావా? 4

కం. అలసితి వీవిటఁ జాలును
విలసిత మౌ నీదుమోముఁ బేరిమిఁ గనఁగన్
పలికింపవె కులుకు తళుకుఁ
బలికింపవె ప్రేమ రాగ భావము లిచటన్ 5

కం. కారణ మేమియొ తెల్పవె!
నీరజ! నీ కనులఁ జూడ నిప్పులు కురిసెన్
నేరము లెంచకు నా హృది
భారముతో నిండియుండె భామా కనవే! 6

కం. చేసిన నేరముఁ దెల్పుమ!
పూసిన పూబంతి వీవు భువిపై రాణీ!
వాసిఁగఁ దెచ్చెదఁ గోరుమ!
బాసను మరువంగ లేను భామిని నిజమే! 7

కం మౌనముఁ దాళఁగ లేనిట
మీనాక్షీ! గనుమ నన్ను మేవడి తోడన్
ప్రాణము విలవిల లాడఁగ
ధ్యానము నీపైన నుంచి యల్లాడితినే! 8

కం. శశి మబ్బులలోకేగిన
నిశలోన గడిపిన నాకు నిబ్బరమే! నా
శశి మిన్నక యుండిన నే
దృశి యైనను గనఁగ నిచట ధృతినిడఁ దగదే! 9

కం. కలువకు దూరము నేగిన
నిలువడు చంద్రుడుఁ గనంగ నిజమిది కనుమా!
చెలిమివి కోపము లేటికి?
చెలియా! దయ తోడ నీవు చెంతను నిలుమా! 10

8. ఏరువాక

మ.కో. వానదేవునికై యజించుచుఁ బ్రార్థన ల్సలుపంగనే
ధ్యానము న్గఁడు భక్తి తోడుత నర్పణమ్మును జేయగన్
మీన మేషము లెంచ కత్తరి మేదినిన్ సరి చేయుచున్
వానకారును వేయికళ్ళను బ్రాతి తోడుతఁ జూడఁగన్ 1

తరళము:

వరుణ దేవుఁడు శీఘ్రము న్గడు వర్షము ల్గురిపింపగన్
తరలె రైతులు భూమి దున్నగ దాల్చి హాలములత్తరిన్
సరిగ జేయగ మన్ను దిబ్బల జల్లినంతనె విత్తులన్
వరలె బంగరు నేలలు న్గడు భాసమొందెను జూడగన్ 2

తే.గీ. జ్యేష్ఠమాసపు పౌర్ణమి నేరువాక
సల్పఁగఁ గృషీవలురు నాడు సంతసముఁగ
జ్ఞాతి బంధువులఁ గలసి సాఁగు కొఱకు
భూమి దున్నఁగఁ జేరిరి పొలుపు మీర 3

ఉ. భూమికి నెడ్లకు స్థాలికిఁ బూజల నిండుఁగ నాచరింపగన్
స్వామికి మ్రొక్కుచు న్పుడమిఁ జక్కఁగఁ ద్రున్నుచు విత్తగన్గడున్
హేమ ఫలంబులు న్గలుఁగ నెల్లరు తోషము నొందఁగ న్గృషీ
ధామము లీ భువి న్సతముఁ దళ్కుల నొప్పఁగ నందమే కదా! 4

మ.కో. రైతులున్ గని మోద మొందఁగ రాజసమ్ముల పైరులన్
జోత లిచ్చిరి భూమితల్లికి నోయగమ్ముల మాతకున్
బ్రాత యప్పులుఁ దీరునంచును భావనమ్ములఁ జేయగన్
దాత వ్రాతలుమారునంచునుధైర్యమున్ గను చుండగన్ 5

చం. విరివిగ పండఁగాఁ మురిసి వేగముఁ గోసిన పంట నూర్చగన్
సరగున నిల్లుఁ జేర్చఁగనె సంతస మొందిన ధర్మ భాగినిన్
బురులకు నెత్తి సర్వమును బొల్పుఁగ జాగ్రతఁ జేసినంతనే
పరగిన సంపద న్గనుచుఁ భర్తకు సేదను దీర్చె నత్తరిన్ 6

ఉ. సంతతి మెండుగన్బైనుపు సంబర మొందఁగ క్రొత్తవస్త్రముల్
సంతస మేర్పడ న్దొడిగి సౌరులఁ గెంతుచు నాట లాడగన్
సుంతయు బాధల న్బడక శోభిలె గేహము లెల్లెడ ల్గనన్
శాంతియు, భాగ్యము ల్గలిగి సౌఖ్యము లబ్బెను గ్రామ మందునన్ 7

కం. వర్షము ఋతువులఁ దప్పక
వర్షము మొత్తముఁ గురిసిన పంటలు పండున్
కర్షకుని మోము నందున
హర్షము కనిపించు నపుడె యందరు సుఖులే 8

కం. గ్రామము నందున రైతులు
సేమముగా నున్నయెడల సీమలు వెల్గున్
సీమల తోడుత దేశము
ధామముగా వెలయుచుండు ధన సంపదలన్ 9

తే.గీ. సాఁగుఁ జేయఁగ పండించి సాకువాడు
రైతు రాజైన గూర్చును రహిని భువికి
స్వార్థ మెరుగని ప్రాణిఁగ వరలు చుండె
జయ జవాను జయకిసాను జయము జయము 10

9. నటనలు

ఆ.వె. రాజకీయమనిన రణరంగ మయ్యెను
తిట్ల దండకముల తీరుఁజూడ
నొకరి పైన నొకరునొంటికాలునలేచి
కొట్టుకొనెడుదినముఁ గూడ వచ్చు 1

ఆ.వె. హామిపత్రముఁగననద్భుతముగనుండు
పీఠమెక్కినంతవెడనుసల్పి
ధనమెమూలమంచుదండు కొనువారు
దాపురించిరయ్య! ధరణియందు 2

ఆ.వె. ఓట్లకొఱకు కొన్ని కోట్ల రూపాయిల
నెఱగఁజూపి శిరము నెక్కి నాట్య
మాడు చుంద్రుమనలనసమర్థులనుజేసి
తెలియ రండు వారి తీరు తెన్ను 3

ఆ.వె. పైన మెఱుఁగుఁజూచి పైన మెఱుఁగుమయ్య!
మేక వన్నె పులులు దిరుఁగుచుండ
ముఖముఁజూచి నమ్మి మోసపోయిన మన
చేతకాని తనముజేటుఁదెచ్చు 4

ఆ.వె. నటనలెన్నొ చూపి నంగనాచిని వోలె
మాటలన్ని ఁజెప్పిమాయఁజేసి
ఓట్లఁగొల్లగొట్టియొట్టునగుపడరు
గద్దెనెక్కివారు గదుము చుంద్రు 5

ఆ.వె. కోతలెన్నొ కోసి గొప్పలఁజెప్పుచు
కాళ్ళవేళ్ళఁబడుచుకదలనీరు
సాగిలంబడుదురుసన్నుతింతురు దొంగ
దండములను బెట్టి దండుకొనఁగ 6

ఆ.వె. పూటకొక్కమాటపుక్కిటంబట్టుచు
చెప్పుచుంద్రు, జనుల చిత్త మెఱిఁగి
ప్రభువు లేలినట్టి ప్రభలు గడచె నేడు
ప్రజల సామ్య మిదియె! భాగ్య మొప్ప 7

ఆ.వె. ఏళ్ళు గడిచి ననిటనెదుగుఁబొదుగు లేదు
భాగ్యవంతుడయ్యె! భాగ్యశాలి
పేదవాడుఁజూడఁబిక్కుబిక్కుమనఁగ
సామ్యవాద మేది? చాటుఁబడియె! 8

తే.గీ. ఓడిపోయిన ప్రత్యర్థి వీడి కలత
కలసిపనిఁజేయునదియేమొ! గెలిచి నట్టి
వానితో తొమ్మిదవ వింత వరలుచుండె
రాజకీయమున బహు చిత్రమిది గనుమ! 9

ఆ.వె. పైకి నుడువు మాట పఱఁగునుభువిలోన
మనసులోన విషము మఱుఁగుచుండు
తెలుసు కొనఁగలేము తీరైన నిజమును
మేడి పండు వలెను మెఱయు చుండు 10

*****

పుష్పమానసము

మంత్రవాది వీర వెంకట సత్యనారాయణ